

కలెక్టర్‌ను కలిసిన డాలర్స్ దివాకర్‌రెడ్డి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

తుడా ఛైర్మన్‌గా నియమితులైన డాలర్స్ గ్రూప్ అదినేత డాక్టర్ సి.దివాకర్‌రెడ్డి కలెక్టరేట్‌లో కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్‌ను శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసారు. దుశ్శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందించారు. తుడా అభివృద్ధికి సహకరించాలని కలెక్టర్‌ను కోరారు. తిరుపతి ఎంఎల్‌ఎ ఆరణి శ్రీనివాసులు, చంద్రగిరి ఎంఎల్‌ఎ పులివర్తి నాని, శ్రీకాళహస్తి ఎంఎల్‌ఎ బొజ్జల సుధీర్‌రెడ్డిలను కలిసారు. నియోజకవర్గ అభివృద్ధిని సమన్వయంతో చేయాలని దివాకర్‌రెడ్డిని ఆయా ఎంఎల్‌ఎలు సూచించారు. చంద్రగిరి నుంచి గూడూరు నియోజకవర్గం విస్తరించి ఉన్న తుడాను సమన్వయంతో అభివృద్ధి చేస్తానని దివాకర్‌రెడ్డి హామీ ఇచ్చారు.



మండల సమావేశం రసాభస
పాఠశాలల విలీనంపై వాగ్వాదం

ప్రజాశక్తి - దొరవారిసత్రం

'లక్షలు వెచ్చించి పాఠశాల భవనాలను నూతనంగా నిర్మిస్తే, వాటిని వదిలేసి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న పాఠశాలల్లో విలీనం చేస్తూ, తమ పిల్లల్ని అంత దూరం ఎలా పంపించాలి' అంటూ తల్లిదండ్రులు తమను నిలదీస్తున్నారని సర్పంచులు వాపోయారు. ఎంపిడిఒం కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం జరిగింది. పాఠశాలల విలీనంపై అధికారులను సర్పంచులు నిలదీశారు. కొద్దిసేపు వాగ్వాదం నడిచింది. ఎంఇఒను సర్పంచులు నిలదీశారు. ఎంఇఒ మాట్లాడుతూ పాఠశాల విలీనం ప్రభుత్వం ఏ విధంగా అయితే జీవో పాస్ చేసిందో అదేవిధంగా పాఠశాల ఎస్ఎంసి కమిటీతో మాట్లాడి నిర్ణయాలు తీసుకుని జిల్లా అధికారులకు పంపించామన్నారు. అయితే సర్పంచులు స్పందిస్తూ గ్రామంలో సర్పంచిగా ఉన్న తమకు సమావేశం సమయంలో తెలపాలి కదా అని నిలదీశారు. తమ పిల్లలు పక్క గ్రామానికి పోవడం ఇష్టం లేదంటూ తల్లిదండ్రులు తమను నిలదీస్తున్నారన్నారు. అనంతరం వ్యవసాయం, కరెంట్, వైద్యం, ఉపాధి, పొదుపు, హౌసింగ్ తదితర సమస్యలపై చర్చ నడిచింది. ఈ కార్యక్రమంలో ఎంపిపి దువ్వూరు సుజాతమ్మ, మండల ఉపాధ్యక్షుడు దువ్వూరు గోపాల్ రెడ్డి, ఎంపీడీవో గోవర్ధన్, తాసిల్దార్ శైల కుమారి, జడ్పిటిసి రమేష్, సిడిపిఓ శారదాంబ పాల్గొన్నారు.

పాఠశాలలను పరిరక్షించుకుందాం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి ప్రభుత్వ పాఠశాలలను పరిరక్షించుకుందామని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు బి మురళీకష్ణ శుక్రవారం పిలుపునిచ్చారు. ఫౌండేషన్ స్కూల్స్ పేరిట కూటమి ప్రభుత్వం చేపడుతున్న విద్యా సంస్కరణలు పాఠశాలల మూసివేతకు కారణమవుతున్నాయన్నారు. ఉపాధ్యాయ సంఘాలు ఈ విధానాలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తున్న ప్రభుత్వం ముందుకే వెళుతుందని మండిపడ్డారు. దశలవారీ ఉద్యమానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు కే వెంకటాద్రి, జిల్లా బాధ్యులు ఏ వెంకటేశ్వర్ రెడ్డి, చెంచురాజు తదితరులు పాల్గొన్నారు.



మండల సమావేశంలో సర్పంచుల ఆవేదన



హంద్రీనీవా రాయలసీమకు వరం: మంత్రి

ప్రజాశక్తి -వి.కోట (చిత్తూరు జిల్లా)

హంద్రీనీవా సుజల స్రవంతి ప్రాజెక్టు రాయలసీమ ప్రాంతానికి వరమని నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. మండల కేంద్రంలోని దాసార్లపల్లి వద్ద జరుగుతున్న హంద్రీనీవా సుజల స్రవంతి రెండో దశ కుప్పం ఉప కాలువ పనులను పలమనేరు ఎంఎల్‌ఎ అమరనాథరెడ్డితో కలిసి శుక్రవారం పరిశీలించారు. జూన్ నెలాఖరుకల్లా పనులు పూర్తి చేయాలన్న లక్ష్యంతో ఉన్నట్లు వివరించారు. గత ప్రభుత్వంలో జగన్మోహన్ రెడ్డి హంద్రీనీవా అంశంలో చేసిన స్టంట్ లపై ఆయన వ్యంగ్యాస్త్రాలు సంధించారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హంద్రీనీవా పనులపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారని తెలిపారు. ప్రతివారం సంబంధిత అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి పనుల పురోగతిపై సమీక్ష నిర్వహిస్తున్నారని తెలిపారు. హంద్రీనీవా కాలువ పరివాహ ప్రాంతాల్లో స్థానిక ప్రజా ప్రతినిధులు, ప్రజలు కోరిన ప్రాంతాల్లో చెరువులకు నీటిని మళ్లించేందుకు చర్యలు చేపట్టాలని సంబంధ అధికారును సమన్వయ పరుచుకుని చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి ఆదేశించారన్నారు. పలమనేర్ ఆర్డీఓ భవాని, జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు సి ఆర్ రాజన్, జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండ యాదవ్, వీ.కోట మండల నాయకులు రామచంద్ర నాయుడు, రంగనాథ్, రాంబాబు పాల్గొన్నారు.

శివుని దర్శించుకున్న ఇస్రో ఛైర్మన్

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి



ఇస్రో ఛైర్మన్ నారాయణన్ శుక్రవారం కుటుంబ సమేతంగా శ్రీకాళహస్తీశ్వరాలయానికి విచ్చేశారు. వీరికి ఆలయాధికారులు సాంప్రదాయ స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. స్వామీ, అమ్మవార్లను దర్శించుకున్నారు. అనంతరం గురుదక్షిణా మూర్తి ఆలయం వద్ద వేద పండితులు ఆశీర్వచనాలు పలికి ముక్కంటి తీర్థ ప్రసాదాలు జ్ఞాపికలు అందజేశారు. తదనంతరం ఆలయం వెలుపల ఇస్రో ఛైర్మన్ నారాయణన్ మీడియాతో మాట్లాడుతూ ఈ నెల 18వ తేదీన శ్రీహరికోట షార్ రాకెట్ కేంద్రం నుంచి లాంచ్ చేయనున్న పీఎస్ఎల్వీ-సీ61/ఈఓఎస్-09 మిషన్ రాకెట్ ప్రయోగం విజయవంతం కావాలని ముక్కంటిని ప్రార్థించినట్లు తెలిపారు.

జులై 9 సమ్మెకు... అంగన్‌వాడీలు సైతం..

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

రాష్ట్రంలోని అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్ల సమస్యల పరిష్కారానికి రాష్ట్రవ్యాప్తంగా జులై 9న ఒకరోజు సమ్మె చేయనున్నామని ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుబ్బరావమ్మ వెల్లడించారు. తిరుపతి యశోదానగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో అంగన్‌వాడీల రాష్ట్ర తరగతులను సుబ్బరావమ్మ శుక్రవారం ప్రారంభించారు. రాష్ట్ర కోశాధికారి ఎస్.వాణిశ్రీ అధ్యక్షత వహించారు. సుబ్బరావమ్మ మాట్లాడుతూ వేతనాల పెంపుకై గత ఏడాది 42 రోజుల పాటు అంగన్‌వాడీలు సమ్మె చేశారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత స్వల్ప సమస్యలు పరిష్కారించారు తప్ప, ప్రధాన సమస్య అయిన వేతనాల పెంపుపై ఇప్పటివరకూ జీవో విడుదల చేయకపోవడం సరైంది కాదన్నారు. దీర్ఘకాలిక సమస్యల పరిస్కారానికి జులై 9న సమ్మె చేయనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కందారపు మురళి, యూనియన్ గౌరవాధ్యక్షులు కెఎన్ఎన్ ప్రసాదరావు, సిఐటియు జిల్లా అధ్యక్షులు జి.బాలసుబ్రమణ్యం, యూనియన్ రాష్ట్ర నేతలు లక్ష్మీదేవమ్మ, రాజేశ్వరి, ఇంద్రాణి, హైమావతి, సౌజన్య, రేవతి, నాగరాజమ్మ పాల్గొన్నారు. ఎఐవైఎఫ్ జాతీయ మహాసభల్లో పాల్గొనేందుకు తిరుపతికి విచ్చేసిన రాజ్యసభ సభ్యులు రహీం అంగన్‌వాడీలను అభినందించారు. కేరళలో తాము నిర్వహిస్తున్న వివిధ అంశాలను వివరించారు. దేశంలో మోడీ ప్రభుత్వం అంగన్‌వాడీలను ప్రభుత్వ అవసరాల కోసం పనులు చేయించుకోవడంలో చూపుతున్న శ్రద్ధ, వారి సంక్షేమం విషయంలో చూపకపోవడం దారుణమన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర నాయకురాలు సుబ్బరావమ్మ

తిరుమలలో యాంటీ డ్రోన్ సిస్టమ్

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

తిరుమల భద్రత నేపథ్యంలో త్వరలోనే యాంటీ డ్రోన్ సిస్టమ్‌ను అమలు చేసేందుకు టిటిడి భద్రతా యంత్రాంగం సమాయత్తం అవుతోంది. ఈ సిస్టమ్‌ను పకడ్బందీగా అమలు చేసేందుకు ప్రణాళిక రూపొందించింది. తిరుమలను నో ఫ్లయింగ్ జోన్‌గా ప్రకటించాలని చాలాసార్లు టీటీడీ కేంద్రానికి విజ్ఞప్తి చేసింది. ఈ మధ్య కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడుకి లేఖ రాసింది. కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడమే తరువాయి.. సాధ్యమైనంత త్వరగా యాంటీ డ్రోన్ సిస్టమ్‌ను అందుబాటులోకి తీసుకురావాలని టీటీడీ భావిస్తోంది.

త్వరలోనే అమల్లోకి..



ఈ టెక్నాలజీతో కొండ పరిసర ప్రాంతాలపై వీడియో ట్రాకింగ్ ఉంటుంది. ఇందులో లాంగ్ రేంజ్ సర్వైలెన్స్ సిస్టమ్.. సుదూర ప్రాంతాల్లో డ్రోన్‌లను ఎగరేసినా ఇట్టే పసిగడుతుంది. ఆర్ ఎఫ్ ట్రాకింగ్ సిస్టమ్‌తో ఆపరేటర్‌కు కచ్చితమైన సమాచారాన్ని అందిస్తూ ఉంటుంది. ఆర్ ఎఫ్ ట్రాకింగ్ సిస్టమ్ అనుమానిత వస్తువుల్ని ఐడెంటిఫై చేయగానే.. మొబైల్ రెస్పాన్స్ టీమ్ అలర్ట్ అవుతుంది. ఆ తర్వాత జామింగ్ సిస్టమ్‌ను యాక్టివేట్ చేస్తారు. దీంతో డ్రోన్‌ను నియంత్రించే సంకేతాలను నియంత్రించి.. అడ్డగిస్తుంది. రెప్పపాటులో డ్రోన్ దగ్గరకు వెళ్లి దాన్ని క్రాష్ చేస్తుంది. ఈ టెక్నాలజీతో కొండపై భద్రతను పటిష్ఠం చేసుకోవాలనుకుంటోంది టీటీడీ 2023లో ఐఒసిఎల్ గ్యాస్ ప్లాంట్ సర్వేకి వచ్చిన కొందరు డ్రోన్‌తో శ్రీవారి ఆలయాన్ని మాడ వీధుల్ని చిత్రీకరించారు. 2024లో హరియాణాకు చెందిన ఓ వ్యక్తి డ్రోన్ ఎగురవేసి శ్రీవారి మెట్టు, నడకమార్గాన్ని చిత్రీకరించాడు. ఈ మధ్య రాజస్థాన్‌కు చెందిన ఓ యూట్యూబర్ మాడవీధులతో పాటు అఖిలాండం వరకు డ్రోన్‌తో షూట్ చేశాడు. ఇలా జరిగినప్పుడల్లా విజిలెన్స్ అధికారులు డ్రోన్లను స్వాధీనం చేసుకుంటున్నారు. అదే యాంటీ డ్రోన్ సాంకేతికత అందిపుచ్చుకుంటే డ్రోన్ ఎగిరే ఛాన్సే ఉండదు.

రేపు అండర్ 19, 23 బాయ్స్ క్రికెట్ సెలక్షన్స్

ప్రజాశక్తి - తిరుపతి సిటీ

ఉమ్మడి చిత్తూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్(సిడిసిఎ) ఆధ్వర్యంలో ఈనెల 4వ తేదీ వర్షం కారణంగా తిరుపతిలో రద్దయిన అండర్ 19, 23 బాయ్స్ క్రికెట్ సెలక్షన్స్‌ను ఆదివారం ఉదయం తొమ్మిది గంటలకు నిర్వహించనున్నట్లు అధ్యక్షులు విజయకుమార్ (క్రికెట్ విజయ్), కార్యదర్శి రవికుమార్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 4వ తేదీ ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని వాల్మీకిపురం, తిరుపతి రెండు జోన్లలో క్రికెట్ సెలక్షన్స్ నిర్వహించగా తిరుపతి సెలక్షన్స్ వర్షం కారణంగా రద్దయ్యిందన్నారు. ఈ మేరకు మే 18 ఆదివారం తిరుపతి స్థానిక మంగళం రోడ్డులోని కజారియా టైల్స్ ఎదురుగా ఉన్న సీవీ క్రికెట్ అకాడమీలో ఉదయం 9 గంటలకు అండర్ 19, 23 మెన్స్ సెలక్షన్స్ నిర్వహించనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు ఉమ్మడి చిత్తూరు జిల్లా కోచ్ సునీల్ కుమార్ 9000214966, సిడిసిఎ జాయింట్ సెక్రెటరీ సతీష్ యాదవ్ 8886185559 నెంబర్ల ద్వారా సంప్రదించవలసిందిగా వారు కోరారు.

మామిడి రైతులను ఆదుకుంటాం : కలెక్టర్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్



రైతుసంఘాల నేతలతో

మామిడి రైతులను అన్ని విధాలా ఆదుకుంటామని, తగిన గిట్టు బాటు ధరలు కల్పించేలా కషి చేయాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ డా ఎస్.వెంకటేశ్వర్ ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టర్ మిని సమావేశపు హాలు నందు జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, మామిడి ఫ్యాక్టరీ యాజమానులు, రైతు సంఘ నాయకులు, వ్యాపారస్తులుతో కలిసి జిల్లా కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం మామిడి రైతులకు అండగా ఉంటుందని తెలిపారు. రాబోయే మామిడి సీజన్‌కు సంబంధించి జిల్లాలో నెలల వారీగా వచ్చే మామిడి దిగుబడి అంచనాలను పరిశీలించి, రైతులకు తగిన మద్దతు ధర అందించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రాసెసింగ్ ఇండస్ట్రీస్ ప్రతినిధులను కోరారు. రైతులు తమ పంటను పూర్తిగా పక్వానికి వచ్చిన తరువాత మాత్రమే కోయాలని, అదేవిధంగా ఒకేసారి కోతకు దిగకుండా దశల వారీగా పంట కోయడం ద్వారా మార్కెట్‌లో స్థిరత్వాన్ని సాధించి, లాభదాయకతను పెంచుకోవాలని సూచించారు. ఫ్యాక్టరీ యజమానులు మామిడి రైతులు ఇరువురు నష్టపోకుండా గిట్టు బాటు ధర కల్పించే దిశగా ప్రభుత్వం యోచిస్తోందన్నారు. ఉద్యానశాఖాధికాధికారి దశరథ రామి రెడ్డి పాల్గొన్నారు.

చలువ పందిళ్లు, షెడ్‌నెట్ వేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

జిల్లాలో స్వర్ణాంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాలు పటిష్టంగా అమలు చేయాలని, వేసవి ఎండల రీత్యా జిల్లాలో అన్ని ప్రాంతాలలో చలివేంద్రాలు, చలువ పందిళ్ళు , షెడ్ నెట్ ఏర్పాటు ఉండాలని జిల్లా కలెక్టర్ డా. వెంకటేశ్వర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమాల అమలు, వేసవి ఎండల దష్ట్యా సంబంధిత శాఖలు తీసుకోవాల్సిన అంశాలపై తిరుపతి నగరపాలక కమీషనర్ ఎన్. మౌర్య , డి.పి.ఓ. సుశీల దేవి, ఎంపిడిఒలు , తహశీల్దార్లు, అధికారులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. వడదెబ్బ తగలకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ట్రాఫిక్ జంక్షన్ల వద్ద షెడ్‌నెట్స్ ఏర్పాటు చేయాలన్నారు. స్కూల్ పిల్లలకు ప్రస్తుతం వేసవి సెలవులు నేపథ్యంలో డ్రాయింగ్, పోస్టర్ మేకింగ్ , ఎస్సే రైటింగ్, వంటి వాటి కార్యక్రమాలు కార్పొరేషన్ పరిధిలో ఆసక్తి ఉన్న పిల్లలకు పెట్టడం జరుగుతుందని తెలిపారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ బ్యాన్, డోర్ టు డోర్ చెత్త సెగ్రిగేశన్ వంటి కార్యక్రమాలపై సెక్రటరీలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.

భక్త కనకదాస విగ్రహ ఏర్పాటుకు మార్గం సుగమం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

తిరుమల శ్రీవారి పరమ భక్తుడు భక్త కనకదాస విగ్రహం ఏర్పాటు చేయాలని దశాబ్దాల కాలంగా ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేస్తున్నామని, నేడు విగ్రహ ఏర్పాటుకు నిర్ణయం తీసుకోవడం శుభ పరిణామం అని తిరుపతి జిల్లా కురబ, కురుమ, కురువ సంఘం అధ్యక్షులు మంగిరి రెడ్డప్ప అన్నారు. శుక్రవారం తిరుపతి ప్రెస్ క్లబ్లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆధ్యాత్మిక కేంద్రం తిరుపతిలోని బస్టాండు కూడలిలో 8.5 అడుగుల భక్త కనకదాస కాంస్య విగ్రహాన్ని బీసీ సంక్షేమశాఖ మంత్రి సవితమ్మ వారి తండ్రి జ్ఞాపకార్థంగా అందివ్వనున్నారన్నారు. భక్త కనకదాస విగ్రహ ఏర్పాటుకు కషిచేసిన జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్య, తిరుపతి శాసనసభ్యులు ఆరణి శ్రీనివాసులుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. ఈ విలేకరుల సమావేశంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి వెంకటప్ప, రెడ్డి కుమార్ గౌడ్ పాల్గొన్నారు.

అన్నమయ్య వ్యక్తిత్వ వికాస నిపుణుడు

ప్రజాశక్తి - తిరుపతి సిటి

అన్నమయ్య ఒక వ్యక్తిత్వ వికాస నిపుణుడని, తన కీర్తనల్లో భగవద్గీత సారాన్ని ఆలపించారని వక్తలు ఉద్ఘాటించారు. తాళ్లపాక అన్నమాచార్యుల వారి 617వ జయంతి ఉత్సవాల్లో భాగంగా ఐదో రోజు శుక్రవారం అన్నమాచార్య కళామందిరంలో అన్నమాచార్య సంకీర్తనలు..నవవిధ భక్తిమార్గాలు' అంశంపై అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ ఇన్‌కంట్యాక్స్ కెఎస్‌ఎ శేషశైలేంద్ర వివరించారు. సాహితీవేత్త గౌరిపెద్ది వేంకట శంకర భగవాన్ మాట్లాడుతూ అన్నమయ్య కీర్తనలు..భగవద్గీత సందేశం అంశంపై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో



పొన్నాకృష్ణమూర్తి పాల్గొన్నారు. అంతకుముందు తాళ్లపాక అన్నమాచార్యుల సంకీర్తనలు అంధుల కోసం బ్రెయిలీ లిపిలో 956 కీర్తనలతో రూపొందించిన పుస్తకాన్ని శేషశైలేంద్ర ఆవిష్కరించారు. అన్నమాచార్య ప్రాజెక్టులో తంబుర ఆర్టిస్ట్ డాక్టర్ బాగేపల్లి ఈశ్వరి రూపొందించారు.

ఏర్పేడు పిహెచ్‌సిలో డిఎంహెచ్‌ఒ తనిఖీలు

ప్రజాశక్తి - ఏర్పేడు

ఏర్పేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బాలకష్ణ నాయక్ ఆకస్మికంగా తనిఖీ చేసారు. ఈ తనిఖీలలో భాగంగా ఎఫ్ ఆర్ ఎస్ , డెలివరీస్, ఓపిసేవలు, ఈ హెచ్ ఆర్ , హై రిస్కు ప్రెగ్నెన్సి డేటా, ఇతర జాతీయ కార్యక్రమాల పై సమీక్ష చేసారు. ఎన్సిడి, సిడి సర్వే వేగవంతం చేయాలని ఆదేశించారు. వేసవి లో వడదెబ్బ కు ప్రజలెవరు గురి కాకూడదని ఓ ఆర్ ఎస్ ప్యాకెట్స్ అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. సిబ్బంది కి సలహాలు, సూచనలు ఇవ్వడం తో బాటు పెర్ ఫార్మెన్స్ ఇంప్రూవ్ చేసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమం లో వైద్యాధికారి డాక్టర్ శివ ప్రియు పాల్గొన్నారు.

భారతదేశమంతా సైనికుల వెంటే ...

ప్రజాశక్తి - తిరుపతి సిటి

భారతదేశమంతా సైనికుల వెంటే ఉందని, సంఘీభావంగా తిరంగా ర్యాలీని నిర్వహించారు. బిజెపి అధ్యక్షులు సామంచి శ్రీనివాస్ నేతృత్వంలో ఎంఆర్‌పల్లి సర్కిల్ నుంచి అన్నమయ్య సర్కిల్ వరకూ జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహించారు. బిజెపి నేత

సంఘీభావంగా 'తిరంగా' ర్యాలీ

నవీన్‌కుమార్‌రెడ్డి భారతదేశ ప్రజలు కంటినిండా గుండెలపై చేయి వేసుకొని నిద్రపోతున్నారంటే దానికి ప్రధాన కారణం భారతదేశ సరిహద్దుల్లో సైనికులు ఉన్నారన్న భరోసాతోనే అని అన్నారు.




ప్రజాస్వామ్య పరిరక్షణ బాధ్యత యువతదే

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

తీవ్ర సంక్షోభ పరిస్థితులను ఎదుర్కొంటున్న ప్రపజాస్వామ్యాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత నేటి యువతదేనని హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జాస్తి చలమేశ్వర్ పిలుపునిచ్చారు. 17వ మహాసభల సందర్భంగా తిరుపతి కనం రాజేంద్రన్ హాలులో ప్రతినిధుల సభను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. సభకు సుఖ్‌జిందర్ మహేసరి, వలీ ఉల్లాఖాద్రి, అరుణ్, లెనిన్, ఆర్తి అధ్యక్ష వర్గంగా వ్యవహరించారు. ముందుగా ఇటీవల మృతిచెందిన వారికి సంతాపసూచికగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఆహ్వాన సంఘం అధ్యక్షులు కె.నారాయణ అధ్యక్షోపన్యాసం చేశారు. జస్టిస్ చలమేశ్వర్ ఎన్నికల సంస్కరణలు, రాజ్యాంగం, పార్లమెంటరీ వ్యవస్థ, ప్రజాస్వామ్యం తదితర అంశాలపై సుదీర్ఘ ప్రసంగం చేశారు.

ఎఐవైఎఫ్ జాతీయ మహాసభలో వక్తలు



జస్టిస్ జాస్తి చలమేశ్వర్

ప్రమాదంలో ఉన్న రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన బాధ్యతను తమ భుజస్కందాలపైకి ఎత్తుకోవాలని పిలుపునిచ్చారు. అఖిల భారత కిసాన్ సభ ప్రధాన కార్యదర్శి రావుల వెంకయ్య మాట్లాడుతూ యువ రైతులు పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. 13 నెలల పాటు జరిగిన చారిత్రాత్మక రైతు ఆందోళనలో పెద్ద సంఖ్యలో యువ రైతులు పాల్గొన్నారని గుర్తు చేశారు. స్వామినాథన్ కమిటీ సిఫార్సులను అమలు చేయడంలో ప్రభుత్వాల వైఫల్యం ఉందన్నారు. రైతుకు మద్దతు ధర లేదని, శ్రమకు తగిన ఫలితం లేదన్నారు. అఖిల భారత ఆర్‌వైఎ ఉపాధ్యక్షులు సుందర్‌రాజన్ మాట్లాడుతూ యువతను కార్పొరేట్లకు అమ్మేస్తున్న మోడీ, దేశ సార్వభౌమత్వాన్ని అమెరికాకు తాకట్టు పెట్టారన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐవైఎల్ జాతీయ నాయకులు బి.జగదీష్‌కుమార్, ఎఐటియుసి జాతీయ కార్యవర్గ సభ్యులు బివివి కొండలరావు, బికెఎంయు జాతీయ అధ్యక్షులు పెరియార్ స్వామి పాల్గొన్నారు.

నామినేటెడ్‌లో 'చినబాబు' హవా

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధికారంలోకి వచ్చిన తరువాత క్యాడర్‌ను పట్టించుకోవడం లేదన్నది తెలుగు తమ్ముళ్ల మనోగతం. ఐదేళ్ల పాటు పార్టీకి కష్టపడి, కేసులు పెట్టించుకుని, డబ్బు పోగొట్టుకుని ఎత్తిన జెండా వదలకుండా ఎన్నికల్లో సైనికుల్లా పోరాడితే సీనియర్లకు నామినేటెడ్ పదవుల్లో న్యాయం జరగలేదని బహిరంగంగానే మండిపడుతున్నారు. చినబాబు (నారా లోకేష్) ను నమ్ముకున్న వారందరికీ పదవులు వచ్చాయని, పెద్దాయనను నమ్ముకుంటే ఏమీ దక్కదని, ఇకపై 'జై లోకేష్' అనాల్సిందేనంటూ తాడేపల్లికి క్యూ కట్టాలని నిర్ణయించారు. ముఖ్యంగా తిరుపతి నియోజకవర్గంలో మహామహులు తుడా ఛైర్మన్ పదవిని ఆశించారు. అయితే ఆ పదవి డాలర్

సీనియర్లకు భంగపాటు



ప్రాధాన్యత లేని పదవుల్లో...

దివాకర్‌రెడ్డికి దక్కింది. దీంతో కొంతమంది సీనియర్ ఆశావాహులు గుర్రుమని ఉన్నారు. పార్టీకి కష్టపడి వైసిపి దాడులను ఎదుర్కొని జైలుకెళ్లిన తెలుగుదేశం నాయకులు మబ్బుదేవనారాయణరెడ్డి, మాజీ ఎంఎల్‌ఎ సుగుణమ్మ, పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి నరసింహయాదవ్, రాష్ట్ర నాయకులు వూకా విజయ్‌కుమార్, జేబీ శ్రీనివాస్, కోడూరు బాలసుబ్రమణ్యం తదితరులంతా చంద్రబాబు వద్ద క్యూ కట్టిన వారే. పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది కానుంది. ఇంతవరకూ నామినేటెడ్ ప్రధాన పదవులను ప్రకటించలేదన్నది వీరందరి ఆవేదన. సుగుణమ్మకు రాష్ట్రస్థాయి పదవి ఇచ్చినా, ప్రాధాన్యత లేనిది ఇచ్చారని ఆమె అనుచరులు బాహాటంగానే చర్చించుకుంటూ గుర్రుమని ఉన్నారు. తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ జాతరకు ముందే బోర్డును ప్రకటిస్తారని ఆశావాహులు నిరీక్షించారు. అయితే ఉత్సవ నిర్వహణ కమిటీతో జాతర కానిచ్చేసింది. ఏదిఏమైనా నామినేటెడ్ పదవులు ఇవ్వడంలో సీనియర్ల పట్ల నిర్లక్ష్యం వహించారన్న కినుకు వారిలో ఉంది.

పోలియో నివారణే లక్ష్యం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు ప్రభుత్వ ఏరియా హాస్పిటల్‌లో నవజాత శిశువులకు ఉపయోగపడే క్యాప్, టవల్స్ అందచేశారు. ఈ కార్యక్రమానికి దాతగా రోటరీ క్లబ్ అధ్యక్షులు బండి శ్రీధర్ రెడ్డి వ్యవహరించారు. ఆయన మాట్లాడుతూ రోటరీ ఇంటర్నేషనల్ చేసే అతిపెద్ద సేవ కార్యక్రమం పోలియో లేకుండా చేయటం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్, పి.వి కృష్ణయ్య, తాళంకి సురేష్, బొల్లు రాంప్రసాద్, రవీంద్ర రెడ్డి, పువ్వాడ వెంకటేశ్వర్లు, బలరామ్ రెడ్డి, హెడ్ నర్స్ గౌరీ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఫల సరుకులు పంపిణీ

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : లయన్స్ క్లబ్ ఆఫ్ గూడూరు వై.జె.పి టౌన్ క్లబ్ సేవా కార్యక్రమంలో భాగంగా పేద వృద్ధులకు ప్రతి నెల ఇచ్చే ఫల సరుకులను పంపిణి చేయడం జరిగింది. వై.జె.పి లయన్స్ క్లబ్ వైస్ డిస్ట్రిక్ గవర్నర్ ఆర్.వి.రావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సేవా దృక్పథాన్ని అలవరచు కోవాలన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు గోపినాథ్ రెడ్డి, మురళి నాయుడు, మురళి రాజు, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

గేట్‌లో పవన్ కుమార్ సత్తా



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ప్రతిష్టాత్మక గేట్-2025 పరీక్షలో శ్రీకాళహస్తికి చెందిన సీనియర్ పాత్రికేయు లు చుక్కల సుబ్బారావు కుమారుడు చుక్కల పవన్ కుమార్ సత్తా చాటారు. దేశవ్యాప్తంగా ఇంజనీరింగ్ విద్యార్థుల మధ్య తీవ్ర పోటీ ఉండే గేట్ పరీక్షలో చుక్కల పవన్ కుమార్ ఉత్తీర్ణత సాధించడం విశేషం. గేట్‌లో పవన్ కుమార్ ఉత్తీర్ణత సాధిం చడం ద్వారా ఉన్నత విద్యనభ్యసించడానికీ, నెలకు రూ.10 వేలు చొప్పున జాతీయ ఉపకార వేతనం పొందేందుకు అర్హత సాధించారు. పవన్ కుమార్ మదనపల్లిలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ పూర్తి చేశారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని టూ టౌన్ సీఐ నాగార్జున రెడ్డి సూచించారు. శుక్రవారం టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. సైబర్, మత్తు పదార్థాల వినియోగానికి వ్యతిరేకంగా యువత పనిచేయాలని పిలుపు నిచ్చారు. ఓటీపీ, సీవీవీ నెంబర్లు, పాస్వర్డ్ ఎవ్వరికి తెలియజేయరాదన్నారు.

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: సైబర్ నేరాలపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని బుచ్చినాయుడు కండ్రిగ సబ్ ఇన్స్పెక్టర్ విశ్వనాథ నాయుడు సూచించారు. శుక్రవారం బుచ్చినాయుడు కండ్రిగ పోలీస్ స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ తిరుపతి జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు స్థానిక డిఎస్పి నరసింహ మూర్తి సూచనలతో సైబర్ నేరాలు ప్రజలకు అవగాహన కల్పించే విధంగా తగు చర్యలు తీసుకుంటున్నామని తెలియజేశారు.

హెల్మెట్ ధారణ తప్పనిసరి

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : ద్విచక్ర వాహన దారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని గూడూరు రెండో పట్టణ సిఐ శ్రీనివాస్ పేర్కొన్నారు. శుక్రవారం గూడూరు, వి జంక్షన్ కూడలి వద్ద వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెల్మెట్ ప్రయాణం మీ ప్రాణానికే రక్షణ అని సూచించారు. ఈ తనిఖీల్లో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బాలకృష్ణ అభిమాని 'మణి'కి పరామర్శ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: టీడీపీ బీసీ నేత, బాలకృష్ణ అభిమాన సంఘం నాయకుడు మణిని ఆ పార్టీ నేతలు శుక్రవారం పరామర్శించారు. మణి కంటి ఆపరేషన్ చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. తొట్టంబేడు మండల టీడీపీ అధ్యక్షులు గాలి మురళి నాయుడు ఆయనను పరామర్శించి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. రెడ్డివారి గురవారెడ్డి, దశరధాచారి, మిన్నల్ రవి, ఉమేష్ రావు పాల్గొన్నారు.

పుత్తూరులో మోస్తరు వర్షం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : ఉక్కపోతతో అల్లాడుతున్న పట్టణ ప్రజలకు కాస్త ఉపశమనం దొరికింది. శుక్రవారం ఉదయం నుండి మధ్యాహ్నం వరకు పుత్తూరులో 39% డిగ్రీల ఎండ తీవ్రత నమోదయింది. మధ్యాహ్నం పైన ఒక్కసారిగా వాతావరణం మారి గాలి వాన సుమారు ఒక గంటపాటు కురిసింది. పట్టణంలో పలు ప్రాంతాలు డ్రైనేజీ కాలువల నిండిపోయి చెత్తాచెదారం రోడ్డుపై వర్షపు నీటితో కొట్టుకొచ్చాయి.

రాజేంద్ర యాదవ్ మృతికి నివాళి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : రూరల్ మండలం పరమేశ్వర మంగళం పంచాయతీ కైలాసపురం సర్పంచ్ హరి యాదవ్ తండ్రి రాజేంద్ర యాదవ్ శుక్రవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి ఆర్.కె రోజా సోదరుడు రాంప్రసాద్ రెడ్డి కైలాసపురం గ్రామానికి వెళ్లి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ భాస్కర్ యాదవ్, వైసిపి మండల అధ్యక్షులు అన్నా లోకనాథం, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

పరశురామేశ్వర స్వామి సేవలో తుడా చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్

ప్రజాశక్తి -ఏర్పేడు : గుడిమల్లం పరశురామేశ్వర స్వామి సేవలో తుడా చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ దేవి కుమారి వారి సహచరులతో పాల్గొన్నారు. ఆలయ మాజీ చైర్మన్ బత్తలగిరి నాయుడు, కార్యనిర్వహణ అధికారి దర్శనం ఏర్పాటు చేశారు.

రేపటి నుండి యోగా సమ్మర్ క్యాంప్

ప్రజాశక్తి - క్యాంపస్ : జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో రేపటి నుండి నెల రోజులపాటు ప్రత్యేక యోగ సమ్మర్ స్పెషల్ క్యాంప్ విశ్వవిద్యాలయంలోని యోగ విజ్ఞాన విభాగం ద్వారా నిర్వహించనున్నారు.

మంచి నీటి సమస్యకు పరిష్కారం


ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : పట్టణంలోని ఎన్టీఆర్ నగర్ వాసులకు మంచినీటి కష్టాలు లేకుండా కొత్త పైపులు ఏర్పాటు చేయాలని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి సూచించినట్లు ఆ వార్డు టీడీపీ ఇంచార్జి నెమళ్లూరి బుజ్జి తెలిపారు. మున్సిపల్ డి ఈ సంజయ్ కుమార్, వాటర్ సప్లై సిబ్బంది సుధాకర్, సచివాలయ సిబ్బంది మౌనిక, గురు ప్రసాద్, పద్మనాభం రెడ్డి, ఫిట్టర్ గురవయ్య, రసూల్ తో కలిసి బుజ్జి ఎన్టీఆర్ నగర్ పైప్ లైన్ ను పరిశీలించారు. 1989లో అప్పటి ఎమ్మెల్యే బొజ్జల గోపాలకృష్ణారెడ్డి వేసిన పైపు లైన్ నేటికీ వినియోగంలో ఉందని బుజ్జి తెలిపారు. ప్రస్తుతం అది మరమ్మతులకు గురవడంతో ఎమ్మెల్యే కొత్త పైపు లైనుకు లైన్ క్లియర్ చేసినట్లు చెప్పారు.

వైభవంగా చక్రస్నానం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు కరణాల వీధి, శ్రీదేవి భూదేవి సమేత శ్రీ చెన్నకేశవ స్వామి దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం చక్రస్నానం, స్వామి అమ్మవార్లకు వసంతోత్సవం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఉభయ దాతలగా తూపిలి రామారావు ,రాజేశ్వరి శ్రీనివాసులు, పద్మజ, కుటుంబ సభ్యులు వ్యవహరించారు.

వెంకటగిరి ఆర్టీసీ డిపోలో ఔట్సోర్సింగ్ కార్మికుల వెట్టిచాకిరి

ప్రజాశక్తి- వెంకటగిరి టౌన్ : వెంకటగిరి ఆర్టీసీ డిపోలో అవుట్సోర్సింగ్ పద్ధతిన యార్డ్ క్లీనింగ్- నలుగురు, బస్సు స్లీపింగ్ అండ్ వాషింగ్-8 మంది, గ్యారేజ్‌లో అసిస్టెంట్ మెకానిక్స్-9 మంది, హేమర్ మెన్ -1 (సమ్మెట వేయువారు) పార్కింగ్ డ్రైవర్స్- ఇద్దరు మొత్తం 24 మంది ఔట్సోర్సింగ్ పద్ధతిన పనిచేస్తూ ఉన్నారు. వీరికి ఎనిమిది గంటల విధులు, 6 రోజుల పని దినాలు వర్తించడం లేదు. పిఎఫ్, ఈఎస్ఐ వర్తింప చేయడం లేదు. చట్ట ప్రకారం రావలసిన సెలవులు ఇవ్వడం లేదు. అవుట్సోర్సింగ్ పద్ధతిన పనిచేస్తున్న ఆర్టీసీ కార్మికులు ఎనిమిది గంటలు పనిచేయాల్సి ఉండగా, వీరు రోజుకు 10 గంటలు డ్యూటీ చేస్తున్నారు. ఉదయం ఆరు గంటలకి డ్యూటీ ఎక్కితే, సాయంత్రం 6 గంటల వరకు డ్యూటీలో ఉంటున్నారు. పని గంటలు ఎక్కువగా ఉన్నాయని కార్మికులు అడిగితే పనిలో నుండి తీసేస్తామని బెదిరిస్తున్నారని సమాచారం. సంబంధిత కాంట్రాక్టర్, ఔట్సోర్సింగ్ కార్మికులకు ఎనిమిది గంటల విదులు, 6 రోజులు పని దినాలు అమలు చేయాల్సిన అవసరం ఉంది.



వెంకటగిరి ఆర్టీసీ బస్టాండు ముఖ ద్వారం

పిఎఫ్, ఈఎస్ఐ చెల్లింపులు లేవు

సంవత్సరాల తరబడి ఔట్సోర్సింగ్ పద్ధతిన కార్మికులు పనిచేస్తున్నప్పటికీ, వీరిలో అనేకమందికి పిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు అమలు చేయడం లేదు. పిఎఫ్, ఇఎస్ఐలకు సంబంధించి కార్మికుల జీతాల్లో మినహాయింపు జరుగుతున్నప్పటికీ, సంబంధిత ఆఫీసులకు కట్టాల్సిన అమౌంటు కట్టడం లేదు. పి.ఎఫ్ కట్టినట్టు సంబంధిత ఆఫీసు చేర్చినట్లుగా ఎలాంటి ఆధారాలు వీరి దగ్గర లేవు. జీవో ప్రకారం వేతనాలు ఇవ్వకుండా తక్కువ వేతనాలు ఇచ్చి కార్మకుల శ్రమ దోపిడీ జరుగుతోంది.

జీఓ ప్రకారం వేతనాలు చెల్లింపులు లేవు

జీవో ప్రకారం, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు జీతాలు చెల్లించడం లేదు. స్కిల్డ్, అన్ స్కిల్డ్, సెమీ స్కిల్డ్ పద్ధతిన క్యాటగిరి వైజ్‌గా వీరికి జీతాలు చెల్లించాల్సిఉంది. కానీ నిబంధనలకు విర్ధుంగా తక్కువ జీతాలు చెల్లిస్తున్నారు. ఈ విషయంలో కాంట్రాక్టర్ చేతివాటం చూపిస్తున్నారనే విమర్శ ఉంది.

నిబంధనల ప్రకారం సెలవులు లేవు

నిబంధనల ప్రకారం అవుట్సోర్సింగ్ కార్మికులకు జాతీయ సెలవులు, వారాంతపు సెలవులు, పండుగ సెలవులు ఇవ్వాల్సి ఉంది. కానీ అవి ఇక్కడ వర్తింపచేయడం లేదు. అవుట్సోర్సింగ్ కార్మికులకు సంబంధించి ఆఫ్ రోజు ముందుగాని తరువాత గాని సెలవు పెట్టినట్లయితే ఆఫ్ రోజు కూడా జీతం కట్ చేస్తున్నారు. వీక్ ఆఫ్ జీతం చెల్లించాలని రాష్ట్రస్థాయిలో యూనియన్ నాయకులు, అధికారుల మధ్య జరిగిన చర్చల్లో అధికారులు అంగీకరించారు. కాబట్టి వీక్ ఆఫ్ రోజు జీతం కాంట్రాక్టర్లు చెల్లించాల్సిన అవసరం ఉంది. జాతీయ సెలవులు, తొమ్మిది రోజులు వీరికి ఇవ్వాల్సి ఉంది. పండుగ సెలవులు ఇవ్వాల్సి ఉన్నా, ఇవ్వడం లేదు. సెలవులు ఇవ్వాలని జీవోలు వచ్చిఉన్నా పట్టించుకోవడం లేదు. ఔట్సోర్సింగ్ కార్మికులకు సంబంధిత అధికారులు కాంట్రాక్టర్లతో మాట్లాడి ఈఎస్ఐ కార్డులు ఇప్పించాల్సిన అవసరం ఉంది. ప్రిన్సిపల్ ఎంప్లాయ్‌గా ఉన్న డిపో మేనేజర్ చొరవ చూపి ఔట్సోర్సింగ్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాల్సిన అవసరం ఉంది.

ఎస్‌డబ్ల్యూఎఫ్ మహాసభలు జయప్రదం



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌డబ్ల్యూఎఫ్ నాయకులు

ప్రజాశక్తి - వెంకటగిరి టౌన్: వెంకటగిరి క్రాస్ రోడ్డు వద్దనున్న ఈఎస్ఎస్ డిగ్రీ కళాశాల వద్ద ఎస్‌డబ్ల్యూఎఫ్ వెంకటగిరి డిపో 11వ మహాసభలు పెద్దయ్య అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిపో సెక్రటరీ ఆర్.కృష్ణయ్య కార్యదర్శి నివేదిక ప్రవేశపెట్టారు. నివేదికను ప్రతినిధులు ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ మహాసభల్లో ముఖ్య అతిథులుగా ఎస్‌డబ్ల్యూఎఫ్ తిరుపతి జిల్లా రీజనల్ అధ్యక్షులు మల్లికార్జున్, సిఐటియు నాయకులు శివాజీ, సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు వడ్డిపల్లి చెంగయ్య, సిఐటియు నాయకులు సిహెచ్ ఉదయభాస్కర్‌లు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ వెంకటగిరి ఆర్టీసీ డిపోలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం, డిపో స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ సిఐటియు కమిటీ కృషి చేయాలన్నారు. లేబర్ కోడ్స్ రద్దు కోసం ఐకమత్యంతో పోరాటం చేయాలన్నారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది. కమిటీ గౌరవ అధ్యక్షులుగా ఏవి రెడ్డి, అధ్యక్షులుగా పెద్దయ్య, ఉపాధ్యక్షులుగా ఎం.బాలరాజు, కార్యదర్శిగా ఆర్.కృష్ణయ్య, జాయింట్ సెక్రటరీగా ఎమ్మెస్ వాసులు, సిహెచ్ ఎస్ వాసులు, కోశాధికారిగా ఐఎస్ వాసులు, ప్రచార కార్యదర్శిగా ఎం.విజయ్, కమిటీ మెంబర్లుగా ఎం. కామాక్షమ్మ, ఏ.కస్తూరమ్మ, కె.మహేష్, శివ తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు జి గోపాల్, వి.ఎస్.రావు తదితరులు పాల్గొన్నారు.

చిల్లకూరు ఎమ్మార్వోపై ఆరోపణలు తగవు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : చిల్లకూరు ఎమ్మార్వోపై అసత్య ఆరోపణలు సరికాదని నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఆదూరు రత్నం పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఉద్యోగులు వంద కోట్లు దోచుకున్నారని మాట్లాడడం హాస్యస్పదం అన్నారు. అగ్ర వర్ణాల వారు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను టార్గెట్ చేస్తూ ఇలా మాట్లాడడం సరికాదని, అందరికీ అందుబాటులో ఉండి పనిచేసే అధికారిపై అసత్య ఆరోపణలు చేయడం సబబు కాదన్నారు. ఈయన వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు చిల్లకూరు వేమయ్య తదితరులు పాల్గొన్నారు.


డిగ్రీ సర్టిఫికెట్‌తో పాటు స్కిల్స్ అవసరం



జాబ్ మేళ కార్యక్రమంలో విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : డిగ్రీ సర్టిఫికెట్‌తోపాటు నైపుణ్యాలు కలిగి ఉండడం చాలా ముఖ్యమని నగరి నియోజకవర్గ శాసనసభ్యులు గాలి భాను ప్రకాష్ పేర్కొన్నారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయిమెంట్ ఎక్స్చేంజ్, సీడాప్, డి ఆర్‌డిఎ 1ఎం1బిలు సంయుక్తముగా పుత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన ఈ జాబ్ మేళాకు ముఖ్య అతిదిగా ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పాల్గొన్నారు. ఈ జాబ్ మేళాలో 25 బహుళ జాతీయ సంస్థలు పాల్గొనగా 284 విద్యార్థులు పాల్గొనారు. వారిలో 161 మందికి ఉద్యోగ అవకాశాలు పొందారు. ఈ కార్యక్రమంలో టిడిపి పార్టీ అధ్యక్షులు గాలి జీవరత్నం నాయుడు, ప్రధాన కార్యదర్శి ఎన్ఎన్ ధనపాల్, రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ గంజి మాధవయ్య, కళాశాల అధ్యాపకులు వివిధ కంపెనీల అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైసీపీ కార్పొరేటర్‌పై హత్యాయత్నం ఘటనపై ఎస్‌పికి ఫిర్యాదు


తిరుపతి జిల్లా ఎస్పీ క్యాంపు కార్యాలయం ముందు వైసీపీ నాయకులు

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : గురువారం 50వ వార్డు కార్పొరేటర్ బోకం అనిల్ పై తెలుగుదేశం పార్టీ రత్నం, విజయ్ తదితరులు విచక్షణారహితంగా కత్తులతో అనిల్, ఆయన తల్లిపై దాడి చేయడం జరిగింది. నిందితులపై కఠిన చర్యలు తీసుకునేలా హత్యాయత్నం కేసు నమోదు చేయాలని మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి డిమాండ్ చేశారు. ఇందులో భాగంగా శుక్రవారం వైస్సార్సీపీ లీగల్ సెల్, ఎస్సీ సెల్, సోషల్ మీడియా, గ్రీవెన్స్ విభాగాల నాయకులు జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రజాశక్తి - తిరుపతి సిటి: తిరుపతి పరిధి, 33/11 కె.వి. శ్రీనివాసపురం సబ్ స్టేషన్‌లోని ఎన్ ఏబిడిల్ ఫీడర్ నిర్వహణకు 17వ తేది శనివారం ఉదయం 7:00 నుండి మధ్యాహ్నం 1.00 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏపిఎస్పిడి సీయాల్ ఆపరేషన్ టౌన్ డివిజన్ విద్యుత్ ఈఈ విన్నకోటిచంద్ర శేఖర్ రావ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. న్యూ ఇందిర నగర్, ఎస్.జి.ఎస్. కాలేజీ రోడ్డు, ఎస్.టి.వి. నగర్, గీత నగర్, ఆంధ్ర స్పైస్ ఏరియా, ఎస్.బి. ఐ కాలనీల వారు సహకరించాలని కోరారు.

ఒప్పంద ప్రాతిపదిక ఉద్యోగాలకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : మాస్ సంస్థ ద్వారా ఒప్పంద ప్రాతిపదికన పనిచేసేందుకు, వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలలో పనిచేయటానికి సెక్యూరిటీ గార్డ్ గార్డ్స్, సెక్యూరిటీ సూపర్వైజర్, డేటా ఎంట్రీ ఆపరేటర్, డ్రైవర్స్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ సంస్థ నిర్వాహకులు ప్రకటన తెలిపారు. వయోపరిమితి 18 నుంచి 35 సంవత్సరాలని తెలిపారు. వివరాలకు 9392275861 ఫోన్ నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

సర్‌ఛార్జి, స్టాంప్ డ్యూటీ నిధులు మంజూరు చేయండి


జిల్లా రిజిస్టర్ జి.శ్రీరామ్ కుమార్‌కు వినతి పత్రం ఇస్తున్న సర్పంచ్‌లు

ప్రజాశక్తి - తిరుపతి సిటి: గ్రామ పంచాయతీలకు రిజిస్ట్రార్ ఆఫీస్ నుండి రావలసిన సర్ చార్జ్ స్టాంప్ డ్యూటీ నిధుల బకాయిలను వెంటనే విడుదల చేయాలని తిరుపతి రూరల్ మండలం సర్పంచులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం తిరుపతి తుడా కార్యాలయం ఎదురుగా ఉన్న జిల్లా రిజిస్టర్ జి.శ్రీరామ్ కుమార్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సాయి నగర్ సర్పంచ్ డివి రమణ మాట్లాడుతూ గ్రామపంచాయతీలకు సుమారు ఒక సంవత్సరం పైగా రావాల్సిన నిధులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. తమ పంచాయతీలలో ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పన ముఖ్యంగా త్రాగునీరు, శానిటేషన్ సమస్యల పరిష్కారానికి, కార్మికులకు జీతభత్యాలకు ఇవ్వడానికి ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. స్పందించిన జిల్లా రిజిస్టర్ జి. శ్రీరామ్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం వారు ఉత్తర్వులు ఇచ్చారని, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని కూడా తమతో నిధులు విడుదల గురించి చర్చించారన్నారు. ఒక వారంలోగా పంచాయతీలకు రావలసిన నిధులు విడుదల చేస్తామని తెలిపారు. ఈ మేరకు తగు చర్యలు తీసుకోవాల్సిందిగా తిరుపతి రూరల్ సబ్ రిజిస్టర్‌ను ఆదేశించారు. అనంతరం ఇదే విషయంగా జిల్లా పంచాయతీ అధికారి సుశీల దేవికి కూడా వినతి పత్రం సమర్పించారు. వెంటనే తగు చర్యలు తీసుకుంటామని డిపిఓ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సాయినగర్ సర్పంచ్ డి.వి.రమణతో పాటు లింగేశ్వర్ నగర్ సర్పంచ్ కోటేశ్వరరావు, అవిలాల సర్పంచ్ సి.వి.రమణ, వోటేరు సర్పంచ్ లక్ష్మీరాజు, బ్రాహ్మణపట్టు సుబ్రహ్మణ్యం రెడ్డి, రామానుజపల్లి సర్పంచ్ రవి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సమక్షంలో టిడిపిలో చేరికలు



టీడీపీలో చేరన నాయకులతో ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్

ప్రజాశక్తి - వాకాడు: గూడూరు నియోజకవర్గ శాసనసభ్యులు పాశిం సునీల్ కుమార్ శుక్రవారం వాకాడులో అనేక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వాకాడు, గొల్లపాలెం గ్రామానికి చెందిన పారిశ్రామికవేత్త పాపా రెడ్డి మనోజ్ కుమార్ రెడ్డి వారి అనుచరులతో ఎమ్మెల్యే సమక్షంలో టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాశిం మాట్లాడుతూ వాకాడులో ఈరోజు నా మనోబలం తిరిగి వచ్చింది అంటూ ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కోట, వాకాడు, చిట్టమూరు మండల అధ్యక్షులు మద్దాలి సర్వోత్తమ్ రెడ్డి, దువ్వూరు మధుసూదన్ రెడ్డి, గణపతి కిషోర్ నాయుడు, మండల నాయకులు పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ మండల కార్యాలయంలో గ్రీవెన్స్‌లో పాల్గొని ప్రజల సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారానికి అధికారులకు దిశా నిర్దేశం చేశారు. తర్వాత ఉగ్ర దాడిని వ్యతిరేకిస్తూ మన సైన్యం విజయం సాధించిన సందర్భంగా విజయోత్సవ ర్యాలీలో భాగంగా అశోక్ పిల్లర్ సెంటర్ వద్ద తిరంగా ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మూడు మండలాల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

మంత్రి లోకేష్‌ను కలిసిన కోడూరు బాల సుబ్రహ్మణ్యం



ప్రజాశక్తి - తిరుపతి సిటి : రాష్ట్ర విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ మూడు రోజుల పర్యటన సందర్భంగా ప్రకాశం, అనంతపురం జిల్లాలోని కార్యక్రమాలలో పాల్గొంటున్నారు. ఈ నేపథ్యంలో లోకేష్ పిలుపు మేరకు టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోడురు బాలసుబ్రహ్మణ్యం అనంతపురం వచ్చి లోకేష్‌ను కలిశారు. తిరుపతిలో ప్రస్తుత పరిస్థితి, జరగనున్న విషయాలపై చర్చించి తగు సూచనలు చేయడం జరిగింది. పార్టీకోసం కోడూరు బాల సుబ్రహ్మణ్యం కృషిని లోకేష్ అభినందించారు. మహానాడు టీడీపీకి పవిత్రమైన పండగని, ఆ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించాలని మంత్రి సూచించారు. మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మకు పదవి దక్కడం, సోషల్ మీడియాలో వస్తున్న వార్తలతో ఈ భేటికి ప్రాధాన్యత సంతరించుకుంది. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి బుల్లెట్ రమణ, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి పెరుమాళ్ మధు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

'వాస్తవాలను పరిగణలోకి తీసుకోవాలి'

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం) 'స్విమ్స్ హాస్పిటల్ వద్ద అంబులెన్స్‌ల దందా' అని వార్తాపత్రికల్లో, టీవీ ఛానళ్లలో వార్తలు వచ్చాయని, ఇందులో వాస్తవాలను పరిగణలోకి తీసుకోవాలని కోరుతున్నామని స్విమ్స్ అంబులెన్స్ సర్వీస్ సొసైటీ అధ్యక్షులు మోహన చారి, సొసైటీ గౌరవ సలహాదారు రామచంద్ర యాదవ్ విజ్ఞప్తి చేశారు. శుక్రవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో సొసైటీ సభ్యులతో కలిసి ఆయన మాట్లాడారు. వాస్తవానికి ఎన్నో ఏళ్లుగా స్విమ్స్ వద్ద అంబులెన్స్‌లు నడుపుకుంటూ 17 మంది జీవనం సాగిస్తున్నారన్నారు. పేద మధ్యతరగతి ప్రజలకు నామమాత్రపు రుసుములు వసూలు చేస్తూ ప్రజాసేవను కొనసాగిస్తున్నామన్నారు. అయితే ఒకరిద్దరూ అంబులెన్స్ సర్వీసులలో పేషెంట్ ఆరోగ్య స్థితి బట్టి వారికి అవసరమైన ఆక్సిజన్ ఇతర పరికరాలను అమర్చుకొని ఉండే అంబులెన్స్ లు వాటికయ్యే ఖర్చు వసూలు చేస్తారన్నారు. కొంతమంది దురుద్దేశపూర్వకంగా ఎంతో నిజాయితీగా ప్రజాసేవ చేసుకున్న తమ అంబులెన్స్ సర్వీసులు మధ్య చోటు కోసం ప్రయత్నం చేస్తూ తమ సొసైటీకి అప్రతిష్ట పాలు తెచ్చేలా ప్రవర్తన చేస్తున్నారన్నారు. దీంతో వారు చేసే అనధికారిక పనుల వలన ఆ నిందలు తాము మోయాల్సి వస్తోందన్నారు. స్విమ్స్ హాస్పిటల్ కు ఎన్ఎబిహెచ్ గుర్తింపు కోసం మహాప్రస్థానం సర్వీసు నడుపుతూ రికార్డుల ప్రకారం 6300 మతదేహాలను ఉచితంగా రవాణా చేసి పేరు పొందామన్నారు. ఈ విలేకరుల సమావేశంలో రమేష్, చందు, శీను, గుణ పాల్గొన్నారు.

క్రైం న్యూస్

శ్రీకాళహస్తిలో సైబర్ మోసం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి పట్టణంలోని ఓ ప్రొవిజన్ స్టోర్‌లో జరిగిన సైబర్ మోసం ఒకటి శుక్రవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. శ్రీకాళహస్తి బస్టాండ్ సమీపంలోని ఓ ప్రొవిజన్ స్టోర్లో బుధవారం రాత్రి ఓ వ్యక్తి రూ.8వేలకు వస్తువులు కొన్నాడు. తన ఫోన్ స్విచ్చాఫ్ అనీ, తండ్రి నుంచి ఫోన్ పే లో డబ్బులు వేయిస్తానని షాపు ఓనర్ ఫోన్ తీసుకున్నాడు. ఫోన్ కలవలేదనీ, ఏటీఎం నుంచి డబ్బులు తెస్తానంటూ అక్కడి నుంచి ఆ వ్యక్తి వెళ్లిపోయాడు. ఆ తర్వాత ప్రొవిజన్ స్టోర్ ఓనర్ ఖాతా నుంచి గురువారం సుమారు రూ.81 వేల వరకు నగదు మాయమైంది. బాధితుడి ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు వన్ టౌన్ సీఐ గోపీ తెలిపారు.

ఆగి ఉన్న లారీని ఢీకొని ద్విచక్ర వాహనదారుడు మృతి



ఘటనా స్థలంలో పడిపోయిన బైక్

ప్రజాశక్తి - రామచంద్రాపురం (చంద్రగిరి) పూతలపట్టు నాయుడుపేట జాతీయ రహదారి చంద్రగిరి మండలం రాహుల్ పంజాబీ డాబా సమీపంలో ఆగి ఉన్న లారీని బుల్లెట్ ద్విచక్ర వాహనదారుడు వెనకవైపు బలంగా ఢీకొనడంతో తలకు తీవ్ర రక్త గాయాలయ్యి అక్కడికక్కడే మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. తమిళనాడుకు చెందిన ప్రసన్న ఎ (22) రేణిగుంటలో ఓ ప్రైవేట్ కంపెనీలో ఎలక్ట్రిషన్ గా పని చేస్తున్నాడు. రేణిగుంట నుండి తన బుల్లెట్ ద్విచక్ర వాహనంలో కాట్పాడికి బయలుదేరగా మార్గమధ్యమం చంద్రగిరి మండలం జాతీయ రహదారి రాహుల్ డాబా సమీపంలో ఆగి ఉన్న లారీని వెనుక వైపు బలంగా ఢీకొనడంతో తలకు తీవ్ర రక్త గాయాలయి అక్కడక్కడే మృతి చెందాడు. ప్రమాదం జరిగిన వెంటనే లారీ డ్రైవర్ లారీ తో సహా అక్కడ నుండి పరారై వెళ్ళాడు. మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం తిరుపతి ఎస్వీ వైద్య కళాశాలకు తరలించి మృతుడు ప్రసన్న అన్న బాలాజీ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో బోల్తా.. 9 మందికి గాయాలు

ప్రజాశక్తి - శ్రీకాళహస్తి రూరల్ : వెంకటగిరి హైవేపై శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో 9 మందికి గాయాలయ్యాయి. రేణిగుంట నుంచి వెంకటగిరికి వెళుతున్న ఆటో ఎంపేడు గ్రామ సమీపంలో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న తొమ్మిది మంది గాయాల పాలయ్యారు. స్థానికుల సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చంద్రగిరి అభివృద్ధికి కృషి చేద్దాం



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

ప్రజాశక్తి - రామచంద్రపురం (చంద్రగిరి): తిరుపతి జిల్లా, చంద్రగిరి నియోజకవర్గంలో అధికారులు ప్రజాప్రతినిధులు అందరం సమన్వయంతో కలసి పనిచేసే చంద్రగిరి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేద్దామని ఎమ్మెల్యే పులివర్తి నాని కోరారు. శుక్రవారం చంద్రగిరి, ప్రైవేటు కళ్యాణ మండపంలో తిరుపతి ఆర్‌డిఓ రామ్మోహన్ అధ్యక్షతన చంద్రగిరి నియోజకవర్గ అభివృద్ధిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యే పులివర్తి నానీ ముఖ్య అతిథులుగా విచ్చేశారు. చంద్రగిరిలో గత పది నెలల పాలనలో చేపట్టిన గోవిందధామం, ఎంపీడీవో కార్యాలయ నిర్మాణం, అసంపూర్తిగా ఆగిపోయిన తహసిల్దార్ కార్యాలయ నిర్మాణాలను పరిశీలించి అధికారులకు సూచనలు ఇచ్చారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ చంద్రగిరి నియోజకవర్గంలో అధికారులు బాగానే పని చేస్తున్నారని, పనితీరును పెంపొందించుకోవాలని సూచించారు. ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న చిన్న గొట్టిగల్లు, యర్రావారిపాలెం, పాకాల మండలాల ఏపీవోలు పనితీరు పట్ల అసహనం వ్యక్తం చేశారు. భూ రీ సర్వేలో ఎలాంటి తప్పులు తడకలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులను కలెక్టర్ హెచ్చరించారు. పూతలపట్టు నాయుడుపేట జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణ కోసం పోలీస్, నేషనల్ హైవే అథారిటీస్ ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు జిల్లా పరిషత్ సీఈవో రవికుమార్ నాయుడు, డ్వామా పిడి శ్రీనివాస ప్రసాద్, పంచాయతీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రామ్మోహన్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ప్రసాద్ రావు, విద్య, వైద్యం, డిఆర్డిఏ, ఐసిడిఎస్, ఆర్డబ్ల్యూఎస్ అధికారులు పాల్గొన్నారు.

జాతీయ డెంగీ దినోత్సవం.. ర్యాలీ



గూడూరులో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గూడూరు లోని పూలతోట, తూర్పు వీధి ప్రాంతంలో డెంగ్యూ రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు.

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: శుక్రవారం జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా 'పరిశీలించండి- శుభ్రం చేయండి- మూతలు పెట్టండి' అనే నినాదంతో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో బుచ్చినాయుడు కండ్రిగ ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం వైద్యాధికారులు డాక్టర్ విద్యాసాగర్, డాక్టర్ మురళీధర్ రెడ్డి, డాక్టర్ డి.ఎన్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు దోమల నివారణకు తీసుకోవాల్సిన చర్యలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశాలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి - రామచంద్రపురం (చంద్రగిరి): జాతీయ డెంగ్యూ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం చంద్రగిరిలో వైద్య శాఖ అధికారులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దోమల ద్వారా వచ్చే వ్యాదులు, తీసుకోవాల్సి జాగ్రత్తలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ యుగంధర్, డాక్టర్ రేవతి డాక్టర్ సౌమ్య ప్రియ, జూనియర్ డాక్టర్లు ముని లక్ష్మి, వెంకుశ , నిత్య, లిఖిత, శ్వేత హెల్త్ ఎడ్యుకేటర్ ఎం.టాటాబాయి, సూపర్వైజర్లు ఎం.ప్రమీల, ఎన్.నారాయణ రాజు, ఏఎన్ఎంలు సుబ్బలక్ష్మి శశిరేఖ, గిరిజ పాల్గొన్నారు.

ప్రజాశక్తి - కేవిబి పురం: కేవీబి పురం మండల ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం జాతీయ డెంగ్యూ నివారణ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రామ్ నాయక్ మాట్లాడుతూ డెంగ్యూ వ్యాధి పట్ల అప్రమత్తంగా లేకపోతే అది ప్రాణాంతకంగా మారే అవకాశం ఉందన్నారు. దోమల నివారణకు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు ఆశాలు ఆరోగ్య కేంద్ర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.